

కథా కౌముది

# వ్యసనం

డి.వి.డి.ప్రసాద్

" అమ్మా! నాకు ఉద్యోగం వచ్చిందమ్మా!" చాలా సంతోషంగా, ఉద్వేగంగా అన్నాడు రవి ఇంట్లోకొస్తూ.

శారదమ్మ ఆ వార్త విని ఆనందంతో తబ్బిబ్బయిపోయింది.

"ఉండు, నాయనా, నీ నోరు తీపి చేసుకో! శుభవార్త చెప్పావు, మన కష్టాలు ఇక గట్టెక్కుతాయి." అంటూ వెంటనే వంటింట్లోకి వెళ్ళి పంచదార తీసుకువచ్చి కొడుకు నోట్లో పోసిందామె.

"అవునమ్మా! మనకిక ఏ కష్టాలు ఉండవు. ప్రభుత్వరంగ సంస్థలో మంచి ఉద్యోగం వచ్చింది. ఇక మరి నువ్వు కష్టపడడం నేను చూడలేను. నువ్వు ఇప్పుడు చేస్తున్న పనులన్నీ మానేయాలి మరి." అన్నాడు రవి.

"అలాగేలేరా!" అంది శారదమ్మ ప్రేమతో కొడుకు తల నిమురుతూ.

భర్త పోయిన తర్వాత ఆమె తనకు చేతనైన పనులు, అంటే కుట్లు, అల్లికలు చేస్తూ ఉండేది. అంతే కాకుండా అప్పడాలు, వడియాలు చేసి తనకి తెలిసిన వాళ్ళకి అమ్మేది. ఆ ఊళ్ళో ఎవరింట్లో శుభకార్యాలైనా ఆమెని వంటా,వార్పులో సహాయంకోసం పిలిచేవారు. అలా కూడా ఆమెకి కొంత ఆదాయం లభించేది. ఏ పని చేసినా ఆమె లక్ష్యం ఒక్కటే, తన కొడుకుని బాగా చదివించాలి. వాడు ఓ పెద్ద ఉద్యోగస్థుడవాలి. తమ కష్టాలు తీరాలి.

ఇన్నాళ్ళకి దేవుడు ఆమె మొర ఆలకించాడు. 'కొంచెం ఉద్యోగంలో కుదురుకున్నాక, రవి పెళ్ళి చేసేస్తే తన బాధ్యత తీరిపోతుంది.' అని మనసులో అనుకుందామె.

రవి భోజనం చేసాక తన స్నేహితులకు తనకి ఉద్యోగం వచ్చిందన్న వార్త చెప్పాలని బయటికి వెళ్ళాడు. తలుపు వేసి మంచం మీద వాలిందామె.

మంచం మీద వాలిన శారదమ్మకు గతమంతా గుర్తుకు వచ్చింది. చాలా చిన్న వయసులోనే ఆమెకి తన పదహారో ఏట మాధవరావుతో వివాహం అయింది. అతనికి పెద్ద చదువులేక పోయినా ఆస్థిపాస్థులుండడంతో శారదమ్మ తల్లి తండ్రులు ఆమె వివాహం మాధవరావుతో జరిపించారు. మాధవరావుకి ఆ ఊళ్ళో ఓ ఐదెకరాల మాగాణి, ఓ కొబ్బరి తోట ఉండేవి. ఓ పెద్ద డాబా ఇల్లు ఉండేది. పొలం మీద వచ్చిన ఆదాయంతో వాళ్ళు హాయిగా బతకవచ్చని, ఆమె భవిష్యత్తు బాగుంటుందని భావించారు ఆమె తల్లి తండ్రులు. అయితే, కాపురానికి వచ్చిన తర్వాత శారదమ్మకి యదార్థం తెలిసింది. ఆమె మావగారికి పేకాట అంటే పిచ్చి ఉండేది. అతని పేకాట వ్యసనానికి వారసత్వంగా వచ్చిన పదెకరాల మాగాణి హారతి కర్పూరంలా హరించిపోయింది. ఇప్పుడున్న ఐదెకరాలైనా మిగిలిందంటే దానికి కారణం అవి ఆమె అత్తగారి పేరు మీద ఉండటమే.

శారదమ్మ కాపురానికి వచ్చిన కొత్తలో ఆమె అత్తగారు అంది, "చూడు శారదా! మీ మావగారి పేకాట వ్యసనానికి చాలా ఆస్తులు కరిగిపోయాయి. పేకాటలో డబ్బులు పోయిన కొద్దీ ఆయన మళ్ళీమళ్ళీ ఆడేవారు, పోయిన చోటే తిరిగి సంపాదించుకోవాలని. ఏనాడైనా పోవడమే కాని,

తిరిగి వచ్చేదేమీ ఉండదని అతనికి తెలియదు. చెప్పినా వినిపించుకునే స్థితిలో ఉండేవారు కాదు. ఈ ఊళ్ళో జూదరుల బారిన పడి చాలా మంది తమ సర్వసం పోగొట్టుకున్నారు. నేనెంత చెప్పినా ఆయన వినేవారు కాదు. అంతా పోగొట్టుకున్నాక గానీ ఆయనకి జ్ఞానోదయం అవలేదు. అప్పటికే ఆలస్యం అయింది. ఆయన బ్రతుకు ముగిసిపోయింది. ఆయన తన చివరి క్షణాల్లో చాలా బాధ పడి, తన పేకాట వ్యసనం అబ్బాయికి రాకూడదని, ఆ విధంగా నన్ను పెంచమన్నారు. మిగిలిన పొలం వ్యవసాయానికి తెలిసిన వాళ్ళకి అప్పచెప్పి వాటిమీద వచ్చిన ఆదాయంతో మెల్లగా మాధవ్‌ని పెంచి పెద్దచేసాను. నా కనుసన్నల్లోనే పెంచాను. చదువు పెద్దగా రాకపోయినా స్కూల్‌ఫైనల్ అయిందనిపించాడు. దేవుడిదయవల్ల వాడికి ఆ దుర్వ్యసనం రాలేదు. పొలం పనులు స్వంతంగా చూసుకుంటున్నాడు. నువ్వు కూడా ఆ విషయమై జాగ్రత్తగా ఉండాలి సుమా!"

అత్తగారి అవేదన అర్ధం చేసుకుంది శారద. ఆ విషయమై ఆమెకి హామీ ఇచ్చింది కూడా.

మాధవరావు వాళ్ళ మాట నిలబెట్టాడు. పేకాట జోలికి అస్సలు వెళ్ళలేదు. అతని స్నేహితులెవ్వరికీ పేకాట వ్యసనం లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు అత్తాకోడళ్ళు. ఆ విధంగా చాలారోజులు ఏ విధమైన ఒడిదొడుకులు లేకుండా సాఫీగా గడిచాయి.

ఓ అయిదేళ్ళలో చాలా పెద్ద మార్పులే వచ్చాయి. ఈలోపున శారదమ్మ అత్తగారు గతించడం, రవి ఈ లోకంలో పడడంలాంటి పెను మార్పులు సంభవించాయి.

కాలక్రమేణా, వ్యవసాయం పెద్దగా కిట్టుబాటు కాకపోవడంతో ఊళ్ళో పొలం అమ్మి పట్టణానికి మకాం మార్చి వ్యాపారం చేద్దామన్న ఆలోచనలో పడ్డాడు మాధవరావు తన స్నేహితుల ప్రోద్బలంతో. శారదమ్మ ఒప్పుకోలేదు అంత సులభంగా. తమ కొడుకు చదువుసంధ్యలు పట్టణంలో అయితే బాగుంటుందంటే ఆమెకి ఇక ఒప్పుకోక తప్పలేదు. తన కొడుకుని బాగా చదివించి పెద్ద ఉద్యోగస్థుణ్ణి చేయాలని ఆమె కోరిక. అంతేకాకుండా, ఈ పల్లెలో ఉంటే తన భర్త ఎప్పుడైనా పేకాట మహమ్మారి బారిన పడే అవకాశం లేకపోలేదు. ఎల్లవేళలా అతనిని కాపు కాయలేము కదా అని ఆమె కూడా పట్టణంలో కాపురానికి మొగ్గు చూపింది.

పట్టణాలలో ఎవరి దారి వారిది, తన భర్తకి పేకాట వ్యసనం అంటుకోదనే నమ్మింది ఆమె. అయితే ఆమెకేమి తెలుసు ప్రమాదం ఏ రూపంలో పొంచి ఉందో?

పట్టణానికి వచ్చిన వేళావిశేషమో ఏమో, మాధవరావు వ్యాపారం దినదిన ప్రవర్ధమానం అయింది. పట్టిందల్లా బంగారం అయింది. కొద్ది రోజులలోనే పట్టణంలోనే ఒక ప్రముఖ వ్యాపారస్తుడయ్యాడు మాధవరావు. తమ జీవితంలో జరిగిన మంచి మార్పులకు శారదమ్మ ఎంతో సంతోషించింది. ఆస్థి అంతస్తూ పెరగడంతో పాటు అతనికి కొత్త స్నేహితులు దొరికారు.

మధ్యమధ్య వ్యాపారం పనులమీద రోజుల తరబడి తిరిగేవాడు తన భాగస్థులతో. అతని వ్యాపారం చెన్నై, హైదరాబాద్‌లకి విస్తరించడంతో వారంలో రెండు, మూడు రోజులు అక్కడికి వెళ్ళి వచ్చేవాడు. వ్యాపారంలో అనుక్షణం మునిగితేలడంవల్ల అతనికి తన తండ్రి లాగ ఏ వ్యసనాలు తగలవని అభిప్రాయ పడిందామె. కాని, తన అభిప్రాయం తప్పని తెలుసుకోవడానికి ఆమెకి ఎక్కువ రోజులు పట్టలేదు. స్నేహితులతో సరదాగా గుర్రపు పందాలకి వెళ్ళిన మాధవరావుకి అది బాగా నచ్చింది. కలక్రమేణా, అతను తన తండ్రి వ్యసనమైన పేకాట కన్న పెద్ద వ్యసనానికి బానిసయ్యాడు. ముందు అతను గుర్రపు పందాలలో పెట్టిన డబ్బులు పోవడంతో రెట్టించిన కసితో మళ్ళీమళ్ళీ అందులోనే పెట్టసాగాడు. మధ్యమధ్య పోయిన డబ్బులు తిరిగి వచ్చేవి. అలాంటప్పుడు, రెట్టించిన ఉత్సాహంతో తిరిగి అందులోనే పెట్టేవాడు. ఉత్సాహం పెరిగినా, కసి పట్టలేకపోయినా, ఫలితం మాత్రం ఒక్కటే. రానురాను, వ్యపారంపైన పైన శ్రద్ధ తగ్గి గుర్రపు పందాలపై శ్రద్ధ పెరిగింది.

మాధవరావు ఈ వ్యసనంలో పూర్తిగా కూరుకుపోయాడని శారదమ్మకి తెలిసేసరికే పరిస్థితి చేతులు దాటిపోయింది. వ్యాపారం మందగించి, అప్పులు పెరిగి, అవి తీర్చుకోవడానికి ఆస్థులు అమ్ముకోవలసి వచ్చింది. ఇన్ని జరిగినా, మాధవరావుకి ఎక్కడో చిన్న ఆశ, ఎప్పటికైనా పోయిన డబ్బులు తిరిగి సంపాదించుకోలేకపోతానా అని. అయితే, దురదృష్టం అతనిని వెన్నంటే ఉండడంతో అతని ప్రయత్నాలేమీ ఫలించలేదు. చివరికి తీవ్రమైన మనస్తాపంతో హార్ట్‌అటాక్ వచ్చి తనువు చాలించాడు మాధవరావు. 'అంతా అయిపోయింది. తను భయపడినంతా అయింది. తమ బ్రతుకు సర్వ నాశనం అయింది.' అనుకుందామె.

అత్తగారి అండ ఎలాగూ లేదు, ఆమె తల్లి తండ్రులు కూడా ఎప్పుడో గతించారు. ఉన్న ఒక్కగానొక్క అన్నయ్య వదిన గయ్యాళితనం వల్ల ఆమెను ఆదుకొనే స్థితిలో లేదు. ఇప్పుడు భర్త కూడా పోవడంతో తీవ్రంగా చలించిపోయింది శారదమ్మ. ఆస్థులన్నీ కరిగిపోగా జీవితంలో ఒంటరిదైన ఆమెకి అంతా అగమ్యగోచరం అయింది. అయితే తన మనుగడ కోసం తనకి తెలిసిన విద్యనే నమ్ముకుందామె. తన కంటి వెలుగైన కన్న కొడుకు రవి మీదే ఆశలన్నీ పెట్టుకొని జీవిస్తోందామె.

తన గతమంతా గుర్తుకు రావడంతో కళ్ళు చెమర్చాయి అమెకి.

'రవి బుద్ధిమంతుడు. చిన్నప్పటినుంచి జీవితంలో ఆటుపోట్లు ఎదురవడంతో చదువుమీద తప్పించి ఇంక దేనిమీద ధ్యాస పెట్టలేదు. బాగా శ్రధ్ధగా చదువుకుని స్కూల్లో, కాలేజీలో మంచి మార్కులు తెచ్చుకున్నాడు. ముందునుండీ, పోటీ పరీక్షలకి తయారై ఉండడంవల్ల ప్రభుత్వరంగ సంస్థలో మంచి ఉద్యోగం సంపాదించుకోగలిగాడు. ఇక తమ కష్టాలు గట్టెక్కుతాయి' అనుకుంది శారదమ్మ.

"అమ్మా! ఏం చేస్తున్నావు?" అని రవి తలుపు తట్టి పిలిచేసరికి ఆమె ఈ లోకంలోకి వచ్చింది. లేచి వెళ్ళి తలుపు తీసింది.

"ఇంద, స్వీట్స్ నీ కోసం తెచ్చాను, తీసుకో!" అంటూ తను తెచ్చిన స్వీట్స్ తల్లికి అందించాడు..

రవి జాబ్‌లో జాయిన్ అయ్యాడు. ఇంటి పరిస్థితులు బాగా మెరుగు పడ్డాయి. శారదమ్మ కొడుక్కి మాట ఇచ్చినట్లు తాను ఇంతకు ముందు చేసే పనులేవీ ఒప్పుకోవట్లేదు. చాలా సుఖంగా రోజులు గడిచిపోతున్నాయి.

ఓ ఏడాది గడిచేసరికి శారదమ్మ కొడుకు పెళ్ళి చేసే యోచనలో పడింది. తనకి తెలిసిన వాళ్ళందరికీ చెప్పింది. రవి ప్రయోజకుడయ్యాడని తెలిసి చాలామంది అమ్మాయిల తల్లితండ్రులు శారదమ్మని వెతుక్కొని వచ్చారు. అలాగ పెళ్ళి సంబంధాలు చూడగా, ఆమెకి లాయరు విశ్వనాధంగారి కూతురు రమ్య బాగా నచ్చింది. ఇరువైపులవాళ్ళు నచ్చుకున్నాక, రవిరమ్యల వివాహం కొద్ది రోజులలోనే జరిగిపోయింది.

వాళ్ళ అన్యోన్య దాంపత్యానికి శారదమ్మ ముచ్చటపడింది. రమ్య కొత్తకాపురంలో బాగా ఇమిడిపోయింది. అత్తాకోడళ్ళూ ఏ అరమరికలు లేకుండా సంతోషంగా ఉన్నారు.

ఈ ఐదేళ్ళలో రవికి ప్రమోషన్ వచ్చి ఉద్యోగంలో హోదా పెరిగింది. ఒక అబ్బాయికి తండ్రి అయ్యాడు కూడా. కొడుకు, కోడలు బాగా చూసుకోవడంతో, మనవడి ఆటపాటలతో శారదమ్మకి రోజులు బాగా గడుస్తున్నాయి.

ఏ రోజైనా రవి రావడం కొద్దిగా ఆలస్యం అయిందంటే చాలు శారదమ్మ మనసు పరిపరి విధాల పోతుంది. మనసు కీడు శంకిస్తుంది. ఏమో ఎవరికి తెలుసు ఎవరు ఏ వ్యసనానికి ఎప్పుడు బానిసవుతారో? వాడు తన తండ్రి, తాత లాగ ఏ వ్యసనాల బారిన పడకూడదని, వాళ్ళ పోలిక రాకూడదని, తను అనుభవించిన కష్టాలు తన కోడలకి రాకూడదని ఆమె ప్రతీరోజూ దేవుణ్ణి ప్రార్థిస్తుంది.

ఆ రోజు రవి ఇంటికొచ్చేసరికి బాగా ఆలస్యం అయింది. తల్లి శారదమ్మ, భార్య రమ్య రవి రాకకై ఆదుర్దాగా ఎదురు చూస్తూండగా రాత్రి పన్నెండు గంటలకి వచ్చాడు.

"ఏమైందండీ? ఈ వేళ ఇంత ఆలస్యం అయింది. ఆఫీస్ గొడవలేం లేవుకదా?" ఆందోళనగా ప్రశ్నించింది రమ్య చాలా అలసటగా వచ్చి సోఫాలో కూలబడ్డ భర్తని.

"ఏమైందిరా! నీ ఒంట్లో బాగుంది కదా?" ఆదుర్దాగా అడిగింది శారదమ్మ వివిధ రకాల అనుమానాలు ఆమె మనసుని తొలుస్తూంటే. ఆమె మనసు కీడు శంకిస్తోంది.

"ఏం లేదు రమ్యా! మా ఆఫీస్‌లో నాతో కలిసి ఉద్యోగంచేసే సహఉద్యోగి రాజారావు అత్మహత్యా ప్రయత్నం చేస్తే అతణ్ణి ఆసుపత్రిలో చేర్చవలసి వచ్చింది. అతను ఇప్పుడు ప్రాణాపాయ స్థితి నుండి గట్టెక్కాడు. ఇంతవరకు ఆసుపత్రిలోనే ఉన్నాను. అతని బంధువులు వచ్చిన తరవాత వాళ్ళకి అప్పచెప్పి వచ్చాను. నా ఇంకో కోలీగ్ వాళ్ళకి సహాయంగా ఇంకా అక్కడే ఉన్నాడు. రేపుదయం మళ్ళీ ఆసుపత్రికి వెళ్ళాలి." అన్నాడు రవి.

రవినుంచి విషయమంతా వినడంతో వాళ్ళు ఇప్పటివరకు అనుభవిస్తున్న మానసిక వేదన చేత్తో తీసినట్లు మాయమైంది.

"ఏమయింది రాజారావుకి? ఎందుకు ఆత్మహత్య చేసుకోబోయాడు?" అడిగింది శారదమ్మ.

"రాజారావు పెద్ద ఊబిలో చిక్కుకున్నాడు. తన స్నేహితుడి సలహా, ప్రోద్బలంతో వివిధ కంపెనీల్లో షేర్లు కొన్నాడు. కొన్న షేర్‌స్‌కి స్టాక్‌మార్కెట్లో విలువ బాగా పెరగడంతో కొత్తలో విపరీతంగా లాభాలు వచ్చాయి. ఊహించని లాభాలు రావడంతో మళ్ళీమళ్ళీ పెట్టుబడి పెట్టేడు. వాడికదో వ్యసనం అయిపోయింది. అందుకోసం చాలా చోట్ల అప్పుకూడా చేసాడు. ముందు కొన్నాళ్ళు లాభాలు తగ్గాయి. ఎప్పటికైనా లాభాలబాట పట్టకపోతుందా అంటే, ఇప్పుడు పెద్ద ఎత్తున నష్టాలు వచ్చాయి. స్వలాభంకోసం కొంతమంది స్వార్ధపరులు కృత్రిమంగా షేర్‌ధరలు నియంత్రించడంతో జరిగిన సంక్షోభంతో చిక్కుకొని నష్టాలపాలయాడు రాజారావు. చేసిన అప్పులు తీర్చే స్తోమత లేదు వాడికి. ఉన్న ఇల్లు అమ్ముకున్నా అప్పులు తీరలేదు. ఆర్థిక సమస్యలు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోబోయాడు. సరైన సమయంలో మేము తెలుసుకోవడంతో అదృష్టవశాత్తూ మృత్యుముఖం నుండి బయటపడ్డాడు. వాడిని మెల్లగా ఆ వ్యసనం నుంచి తప్పించాలి." వివరించాడు రవి.

అంతా విన్నాక, శారదమ్మ, రమ్య దీర్ఘంగా నిట్టూర్చారు.

శారదమ్మకి రవి మీద తన నమ్మకం రెట్టింపయింది. తన కొడుకు చాలా ఎదిగిపోయాడని అనిపించిదామెకు ఆ క్షణంలో.

"త్వరగా పడుక్కో నాన్నా, ఏమైనా కొంత తినేసి. చాలా అలసిపోయావు. రేపు ఉదయం మళ్ళీ హాస్పటల్‌కి వెళ్ళాలి." అందామె తన గదిలోకి వెళ్తూ.

★★★

Click here to share your comments on this story